

కరెంటు కోతలతో ప్రజల అవస్థలు

పెంటపాడు: రాష్ట్రంలో లేని కరెంటు కోతలను నిలుపుదల చేయాలని, చిన్న పరిశ్రమలకు, వ్యవసాయ రంగానికి ఇది తీరని నష్టమని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి సిరపరపు రంగారావు విలేకరులతో మాట్లాడుతూ కరెంటు కోతలతో జనం అల్లాడిపోతున్నారన్నారు. ఒకవైపు ఎండ వేడిమి, మరో పక్క కరెంటు కోతలతో వృద్ధులు చిన్నారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్రంలో జెన్‌కో ఆధ్వర్యాన బొగ్గు ద్వారా కరెంటు ఉత్పత్తి చేసే మూడు కేంద్రాలు ఉన్నాయని, ఒకటి నెల్లూరు జిల్లాలో, కృష్ణపట్నం ప్లాంటు రాయలసీమలో ఒక ప్లాంట్, విజన్ ప్లాంట్ ఒకటి ఈ మూడు ప్లాంట్లకు 15 రోజులకు సరిపడా బొగ్గు నిల్వ ఉండాలని కానీ అక్కడ ఉన్న నిల్వలో రెండు రోజులకు కూడా కరెంటు ఉత్పత్తికి బొగ్గు సరిపోదని, కరెంటు తక్కువ ఉత్పత్తి చేయడం వల్ల ఈ ప్రమాదం ఏర్పడిందని వారు తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజల అవసరాలను తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్తి కోదండరామిరెడ్డి, కొవ్వూరి రామ్‌రెడ్డి, పెనగంటి దుర్గ పాల్గొన్నారు.

15 స్థానాలు గెలిపిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తా

సొంతూరుకు రోడ్డు వేసుకోలేని ఎంఎల్ఎ వాసుబాబు

జిఒ 79 రద్దు చేసి పోలీసుల అలవెన్స్ పునరుద్ధరిస్తాం

గణపవరం సభలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్



వృద్ధురాలితో మాట్లాడుతున్న లోకేష్



గణపవరం సభలో మాట్లాడుతున్న లోకేష్

ప్రజాశక్తి - భీమవరం


రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో టిడిపిని గెలిపించాలని, అప్పుడు అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కోరారు. జిల్లాలో మంత్రులు, ఎంఎల్ఎలు ఉన్నప్పటికీ అభివృద్ధి ఆమడ దూరంలో ఉందని, రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపు ఖాయమని చెప్పారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 203వ రోజు ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం నిడమర్రు మండలం చిననింద్రకొలను నుంచి ఆదివారం ఉదయం ప్రారంభమైంది. పెద్దనింద్రకొలను, నిడమర్రు, మందలపర్రు, భువనపల్లి మీదుగా గణపవరం చేరుకుంది. అక్కడ శేషమహల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడారు. ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు తగ్గించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామన్నారు. మద్యపానం నిషేధం వంటి అనేక హామీలు ఇచ్చి మహిళలను జగన్ మోసం చేశారన్నారు. టిడిపి అధికారంలోకొస్తే అమలు చేసే పథకాలను వివరించారు. ఆక్వా, వరిసాగు క్రాప్ హాలిడేలతో సంక్షోభంలో ఉన్నాయన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీకి ఉద్యోగులకు జీతభత్యాలు అందించి అందరికీ ఆమోదయోగ్యమయ్యే ఫిట్‌మెంట్ అందిస్తామన్నారు. జిఒ 79ని రద్దు చేసి పోలీసుల అలవెన్స్ పునరుద్ధరిస్తామన్నారు. ఆక్వా రైతులకు పెట్టుబడి తగ్గించి గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. ఆక్వా జోన్‌లతో సంబంధం లేకుండా రూ.1.50 పైసలుకే యూనిట్ విద్యుత్ అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్ జిల్లా పర్యటనలో భాగంగా ఉంగుటూరు వచ్చిన సందర్భంలో అనేక హామీలు ఇచ్చారని, అవన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. కొల్లేరుపై రెగ్యులేటర్ల నిర్మాణం, సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణం, కొల్లేరులో తాగునీటి సమస్య పరిష్కారం , ఏలూరు కాల్వపై వంతెనల నిర్మాణం వంటి హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు.

సొంత ఊర్లో రోడ్డు వేసుకోలేని అసమర్ధుడు ఎంఎల్ఎ వాసుబాబు

నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో నలుగురు బినామీలను పెట్టి ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ప్రజలను దోచేస్తున్నారని లోకేష్ ఆరోపించారు. వాసుబాబు బంధువు షాడో ఎంఎల్ఎగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎంఎల్ఎ సొంతూరులో సొంత రోడ్డు వేసుకోలేని అసమర్ధుడని తీవ్రంగా విమర్శించారు. ఎంఎల్ఎ ఊరిలో సురక్షిత తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

గుంతలు తప్ప రోడ్డు ఎక్కడుంది జగన్

నిడమర్రు (గణపవరం): 'ఇది ప్రధాన రహదారి. ఇక్కడ గుంతలు తప్ప రోడుడ ఎక్కడుండి జగన్' అంటూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. నిడమర్రు మండల కేంద్రానికి వచ్చే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండటంపై లోకేష్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి జగన్ మాటలు కోటలు దాటుతాయిగాని, పనులు మాత్రం గజం కూడా ముందుకు సాగవని విమర్శించారు. అధికారంలో వచ్చి 51 నెలలైనా డేట్లు మారుతున్నాయి తప్ప రాష్ట్రంలో రోడ్ల ఫేట్ మారడం లేదన్నారు. కాంట్రాక్టర్లకు రూ.1.30 లక్షల కోట్ల బిల్లులు బకాయిలు పెట్టడంతో ఎన్నిసార్లు టెండర్లు పిలిచినా జగన్ ముఖం చూసి టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు.



ఆక్వా రైతులతో మాట్లాడుతున్న లోకేష్


ఆక్వా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న లోకేష్

చిననింద్రకొలను నుంచి వస్తుండగా మార్గమధ్యంలో ఆక్వా రైతులను లోకేష్ పలుకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చేపల రైతు అప్పారావు మాట్లాడుతూ 15 ఏళ్లుగా తాను చేపలు సాగు చేస్తున్నానని, జగన్ అధికారంలోకొచ్చాక సీడ్, ఫీడ్, విద్యుత్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా సరైన ధర లేక ప్రతియేటా రెండు నుంచి మూడు లక్షల వరకూ నష్టం వాటిల్లుతుందని వాపోయారు. గత ప్రభుత్వ హయాంలో రూ.లక్ష కడితే ట్రాన్సఫార్మర్ ఇచ్చేవారని, ఇప్పుడు మూడు లక్షలుపైనే కట్టాల్సి వస్తోందని తెలిపారు. ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, అవసరమైన మేర కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందని అప్పారావు వివరించారు. దీనిపై లోకేష్ మాట్లాడుతూ టిడిపి హయాంలో ఆక్వా రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించామని, ఆక్వా ఎగుమతుల్లో ఎపిని నెంబర్ వన్‌గా నిలబెట్టామని చెప్పారు. జగన్ పాలనలో ఆక్వా హాలిడే చూస్తున్నామని విమర్శించారు. ఆక్వా రంగానికి రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తామని చెప్పి రైతులను జగన్ నిలువుగా మోసగించారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆక్వా రంగాన్ని ఆదుకుంటామన్నారు.

పెదనింద్రకొలనులో కాపు సామాజిక తరగతికి చెందిన వారు లోకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు పునరుద్ధరించాలని కోరారు. దీనిపై లోకేష్ మాట్లాడుతూ కాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తామని, కాపు రిజర్వేషన్లకు సంబంధించి సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. నిడమర్రులో పలువురు వినతిపత్రాలు అందించారు. నిడమర్రు పోలీస్ స్టేషన్ నుండి అడవికొలను వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ జగన్ ప్రభుత్వ నిర్వాకం కారణంగా గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చల్లడానికి నిధుల్లేని దుస్థితి నెలకొందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక వాటర్ గ్రిడ్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామని, పాడైపోయిన రోడ్లన్నింటినీ పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు



కరచాలనం చేస్తున్న లోకేష్



ఘర్షణలో ధ్వంసమైన కారు

మందలపర్రులో ఉద్రిక్తత

టిడిపి, వైసిపి పరస్పర రాళ్ల దాడి

వైసిపి కవ్వింపు చర్యల ఫలితం

ఏలూరు జిల్లా తెలుగు యువత నేత రెడ్డి చందు కారు ధ్వంసం

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా ఏలూరు జిల్లా నిడమర్రు మండలం మందలపర్రులో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పాదయాత్ర వెళ్లే మార్గంలో అడ్డుగా వైసిపి శ్రేణులు కొందరు ద్విచక్ర వాహనాలను అడ్డుపెట్టి, జెండాలు చూపుతూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో వైసిపి, టిడిపి శ్రేణుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువురు పరస్పర దాడికి దిగి రాళ్లు రువ్వుకున్నారు. సుమారు 15 నిమిషాలపాటు మందలపర్రు రణరంగంగా మారింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరుపక్షాలను సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. వైసిపి కార్యకర్తలు జెండాలను ఊపుతూ జై జగన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో టిడిపి, వైసిపి శ్రేణులు పరస్పరం దూషించుకుంటూ పిడి గుద్దులు గుద్దుకుంటూ రెచ్చిపోయారు. ఈ నేపథ్యంలో పోలీస్ బలగాలు పెద్దసంఖ్యలో చేరుకుని ఇరుపక్షాలను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ప్రస్తుతం మందలపర్రు పోలీసు పహారాలో ఉంది. ఈ ఘర్షణలో ఇరుపక్షాలకు చెందిన కొంతమందికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో తెలుగు యువత ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి చందు కారును వైసిపి శ్రేణులు ధ్వంసం చేశాయి. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్తత నడుమ నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముందుకు సాగింది.

పిఎం విశ్వకర్మ యోజన ద్వారా ప్రయోజనం పొందాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



ప్రజాశక్తి - భీమవరం

పిఎం విశ్వకర్మ యోజన ద్వారా 18 రకాల చేతివృత్తులవారు ప్రయోజనం పొందాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారుల వ్యాపారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు కుట్టేవారు, తాపీపని చేసేవారు, బుట్ట, చాప చీపుర్లు చేసేవారు, బొమ్మల తయారీదారులు, క్షురకులు, రజకులు, దర్జీలు, చేపల వల తయారీదారులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఈ పథకం కింద వృత్తిదారులకు వారు చేసే పనిలో నైపుణ్యాన్ని మెరుగుపర్చేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా 5 నుండి 7 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారికి 15 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 చొప్పున స్టైఫండ్ కూడా అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం రూ.15 వేల విలువైన టూల్ కిట్టు అందజేస్తామని తెలిపారు. తక్కువ వడ్డీకి రుణాలను అందజేస్తామని తెలిపారు. వివిధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఈ పథకం ద్వారా గొప్ప ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లోని సాంప్రదాయ కుల, హస్త కళాకారులకు, నైపుణ్యాభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడం, మార్కెట్ అనుసంధానం చేయడం, సామాజిక భద్రత అందించడం ఈ పథకం లక్ష్యమని వివరించారు. ఇందుకోసం సాంప్రదాయ వృత్తిదారుల వ్యాపారాలను బలోపేతం చేసేందుకు 2023-2028 వరకూ ఐదేళ్లపాటు ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయనుందని తెలిపారు. సాంప్రదాయ హస్త కళా నైపుణ్యాల పెంపునకు ఆర్థిక సహాయం అందించడం కోసం కేంద్రం విశ్వకర్మ యోజన పథకం తీసుకొచ్చిందని తెలిపారు. చేతివృత్తులు చేసుకునేవారు, హస్తకళల నిపుణులు రూపొందించే వస్తువుల, సేవల నాణ్యతను మెరుగుపర్చి దేశీయంగా, విదేశీ వ్యాపారులతో స్థానిక ఉత్పత్తి దారులు ముడిపడేటట్లు చేయడమే ఈ పథకం ముఖ్యోద్దేశమని తెలిపారు. చేతివృత్తిదారులు కామన్ సర్వీస్ సెంటర్లు, మీసేవ, సచివాలయాల ద్వారా ఆధార్‌కార్డుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. రిజిస్టర్ అయిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డు ఇస్తామని తెలిపారు. చేతివృత్తుల పనివారికి శిక్షణ ఇచ్చి అవసరమైన వస్తు సామగ్రి కొనుగోలు నిమిత్తం 18 వాయిదాల్లో తిరిగి చెల్లించే విధంగా ఐదు శాతం వడ్డీతో తొలిదశగా రూ.లక్ష వరకూ బ్యాంకుల ద్వారా రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. రుణం సక్రమంగా చెల్లించే వారికి వ్యాపారాభివృద్ధికి తర్వాత దశల్లో రూ.2 లక్షలు, రూ.3 లక్షలు రుణం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీన ప్రధానమంత్రి పిఎం విశ్వకర్మ యోజనను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. పథకం ప్రారంభం నాటికి లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. చేతివృత్తుదారులు వారి అమ్మకాలను డిజిటల్ ట్రాన్సాక్షన్ ద్వారా చేసినట్లయితే ప్రతిరోజూ 100 ట్రాన్సాక్షన్‌కు లిమిట్ చేసి వంద రూపాయలు అదనంగా వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకాన్ని చేతివృ త్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

జిల్లాను శ్మశానం చేశారు

వైసిపి పాలనపై మందలపర్రులో టిడిపి ఘాటు విమర్శలు

ప్రజాశక్తి - భీమవరం, నిడమర్రు

సస్యశ్యామలంగా ఉండే పశ్చిమగోదావరి జిల్లాను వైసిపి అధికారం చేపట్టాక శ్మశానంగా మార్చేసిందని టిడిపి ఘాటుగా విమర్శించింది. జిల్లాను అభివృద్ధి చేయకుండా ఘర్షణలు, దాడులకు నిలయంగా మారుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి జగన్ ఒక్కసారే అవకాశం అడిగారని, మళ్లీ అవకాశం అడగడానికి ఆస్కారం లేదని, రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చింది. వైసిపి చేసిన దాడిని ఉభయగోదావరి జిల్లాలపై చేసిన దాడిగా పరిగణిస్తున్నామని నేతలు స్పష్టం చేశారు. ఉంగుటూరు నియోజకవర్గం నిడమర్రు మండలం మందలపర్రు క్యాంపు సైట్ వద్ద టిడిపి ముఖ్య నేతల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడారు. ప్రశాంతతకు మారు పేరు పశ్చిమగోదావరి జిల్లా అన్నారు. రాష్ట్రంలో సైకో ముఖ్యమంత్రి ఉంటే ఎలాంటి గొడవలు జరుగుతాయో కళ్లారా చూస్తున్నామన్నారు. కావాలనే వైసిపి అల్లరి మూకలు దాడులకు పాల్పడుతున్నాయనీ విమర్శించారు. రాళ్లు, రాడ్లతో దాడి చేయించడం దారుణమన్నారు. గతంలో ఎన్నడూ ఇటువంటి గొడవలు లేవని, వైసిపి అధికారం చేపట్టాక ఇటువంటి దౌర్భాగ్యం రావడం దురదృష్టకరమన్నారు. విమర్శకు ప్రతి విమర్శ సమాధానం, దాడులు కాదనీ పేర్కొన్నారు. లోకేష్ యాత్ర విజయవంతంగా జరుగుతుందని, కావాలనే యాత్రను అడ్డుకోవడానికి వైసిపి చూస్తోందని విమర్శించారు. పాదయాత్రను అడ్డుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వచ్చేఎన్నికల్లో బుద్ధి చెబుతామన్నారు. పోలీసులను కూడా హెచ్చరిస్తున్నామని, గొడవలు సృష్టించే వారిని అడ్డుకోవాలని కోరారు. పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రశ్నించినందుకు టిడిపి కార్యకర్తలపై దాడులకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. గోదావరి జిల్లాల మంచి, మానవత్వం, ప్రశాంతతకు మారు పేరని అలాంటి సంస్కృతిని జగన్ పాడుచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎంతో మంది పాదయాత్రలు చేశారని, ఎప్పుడూ యాత్రలపై దాడులు జరగలేదని తెలిపారు. సిఎం ఒక క్రూర మనస్తత్వం ఉన్న వ్యక్తి అని విమర్శించారు. ఏలూరు మాజీ ఎంపీ మాగంటిబాబు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చాక పచ్చని పశ్చిమగోదావరి జిల్లాను శ్మశానం చేశారని విమర్శించారు. మరోసారి గెలిచే అవకాశం లేకపోవడంతో లండన్‌కు వెళ్లి దాడులకు ఉసిగొల్పారన్నారు. జగన్ విదేశాలకు ఎందుకు వెళ్తున్నారో అందరికీ తెలుసని తెలిపారు. యువగళం పాదయాత్రను అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవడం దారుణమన్నారు. యాత్రకు భద్రత కల్పించడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.



టిటిడి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన మేకా శేషుబాబుకు శ్రీవారి ఫొటో అందజేస్తున్న అధికారులు

మతోన్మాద బిజెపిని సాగనంపాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెంచిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మతోన్మాద బిజెపిని సాగనంపాలని కోరుతూ ఆదివారం ఐదో రోజు సిపిఎం తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమరభేరి యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక 35వ వార్డులో, ఎస్‌విఆర్ విగ్రహం నుంచి పెంటపాడు వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ నాయకులు కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ఈ నెల నాలుగో తేదీన మండల కార్యాలయాల వద్ద జరగబోయే ధర్నాను జయప్రదం చేయాలని పట్టణ ప్రజలను కోరారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం, ప్రతిపక్షాలైన టిడిపి, జనసేన మోడీ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించి పోరాటంలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. మోడీకి దేశాన్ని పాలించే అర్హత లేదని విమర్శించారు. స్వాతంత్ర్యోద్యమంలో కనీస పాత్రలేని వారు దేశాన్ని పాలించడం సిగ్గుచేటన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పనిచేస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి నిధులు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. సోమవారం మండల కార్యాలయాల వద్ద జరగబోయే ధర్నాలో పట్టణ ప్రజలంతా పాల్గొని బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, దేశం నుండి బిజెపిని తరిమికొట్టాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మడకా రాజు, జవ్వాది శ్రీను, శిద్ధిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, గొర్రెల వంశీ పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

తణుకు రూరల్ : అధిక ధరలు, నిరుద్యోగం తదితర సమస్యలపై తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం 4న జరిగే ధర్నాలో ప్రజలు, యువత పెద్దఎత్తున పాల్గొనాలని సిపిఎం పట్టణ కమిటీ పిలుపు నిచ్చింది. ఆదివారం పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో ధరలు, నిరుద్యోగంపై సంతకాల సేకరణ, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఎన్నికలు వచ్చినప్పుడే అన్ని పార్టీలకూ ప్రజలు గుర్తుకొస్తారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికార పార్టీకి విన్నవించినా పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. నేటికీ ప్రజలను కేవలం ఐదు సంవత్సరాలకోసారి వచ్చే ఓటు బ్యాంకుగా చూస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలు గానీ, వారి జీవన ప్రమాణాలు గానీ, వారిపై పడుతున్న భారాలు గానీ ఆలోచించే ఓపిక, సహనం పాలకులకు లేకపోవడం అన్యాయం అన్నారు. ప్రజలు పక్షాన పని చేస్తున్న వారికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, రాజశేఖర్, సుగుణరావు, శ్రీను, పద్మారావు, ముత్యాల రావు, ప్రసాద్ పాల్గొన్నారు.



తణుకులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఆకివీడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజురోజుకూ ధరలు పెంచుకుంటూ పోతున్నాయని, ప్రజలు నిరసన తెలపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలో నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ సామాన్యుడు అధిక ధరలను మోయలేకపోతున్నాడన్నారు. పెట్రోల్ రూ.70 నుంచి రూ.120లకు పెరిగిందని, వంట గ్యాస్ రూ.400 నుంచి రూ.1200లకు, ఇక నిత్యం వాడుకునే పప్పు, ఉప్పు, నూనె చింతపండు ఇలా అనేక రకాల నిత్యావసరాలు భారీగా పెరిగాయని తెలిపారు. ప్రజలందరూ ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పకపోతే రాబోయే రోజుల్లో సామాన్యుడు బతుకు గడవదన్నారు. ఈ మేరకు సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడుతున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కె.తవిటినాయుడు, బి.రాంబాబు, డి.రవితేజ, బివి.వర్మ ఎస్‌కె.వలీ, జి.లావణ్య, ధనుష్, గేదెల రాము, పాపారావు, సూరిబాబు పాల్గొన్నారు.

నేడు తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, భారాలకు వ్యతిరేకంగా ఈనెల 4వ తేదీ సోమవారం తహశీల్దారు, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు, ప్రత్యేక ఛార్జీలు, ఆస్తి, చెత్త పన్ను, రిజిస్ట్రేషన్ ఛార్జీలు తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. బిజెపి దేశ ప్రజలను, రాష్ట్రాన్ని మోసం చేసిందని విమర్శించారు. ధర్నాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలపాలని విజ్ఞప్తి చేశారు.

సౌకర్యాల మెరుగుకు కృషి

టిటిడి సభ్యులుగా శేషుబాబు ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - పాలకొల్లు

టిటిడి సభ్యులుగా మేకా శేషుబాబు ఆదివారం తిరుమల శ్రీవారి సన్నిధిలో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ యాత్రికుల మనోభావాలకు అనుగుణంగా తిరుమలలో సౌకర్యాల మెరుగుదలకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. టిటిడి కళ్యాణ మండపాల నిర్మాణం, నిర్వహణ మెరుగుదలకు కృషి చేస్తానని చెప్పారు. శేషుబాబు తల్లిదండ్రులు, మేకా కోటేశ్వరరావు, సోదరుడు, ఆగర్రు సొసైటీ అధ్యక్షులు మేకా రామకృష్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టిటిడి ఛైర్మన్‌కు గోదావరి రైతు బొమ్మ జ్ఞాపికను అందించిన శేషుబాబు

టిటిడి సభ్యులుగా ఆదివారం ప్రమాణస్వీకారం చేసిన మేకా శేషుబాబు టిటిడి ఛైర్మన్ కరుణాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో తయారవుతున్న కాడెద్దులతో ధాన్యం తోలుకెళ్తున్న రైతు టేకుతో తయారైన బొమ్మను ఆయనకు బహుమతిగా అందజేశారు. ఆయన గోదావరి జిల్లాల ముఖచిత్రంగా ఉన్న చక్కటి జ్ఞాపికను ఇచ్చినందుకు శేషుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. శేషుబాబు కుమారులు టిటిడి ఛైర్మన్‌తో మాట్లాడారు.

బీచ్ వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంబీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ద్విచక్ర ప్రత్యేక వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తేనెలపై, ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటలో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు


కిడ్స్ ప్లే జోన్‌ను ప్రారంభిస్తున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోపి

పాలకొల్లులో కిడ్స్ ప్లే జోన్ ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో చిన్నారుల అభిరుచికి తగ్గట్టు కిడ్స్ ప్లే జోన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి చెప్పారు. ఇప్పటివరకు నగరాలు, పెద్ద పట్టణాల్లో ఉండే కిడ్స్ ప్లే జోన్‌ను పాలకొల్లులో ఏర్పాటు చేశారు. కిడ్స్ ప్లే జోన్‌ను గుడాల గోపి ఆదివారం ప్రారంభించారు. దీనిలో ప్లే స్టేషన్, మ్యూజిక్ స్టేషన్, సెల్ఫీ సిస్టం, జంపింగ్ బౌన్స్, రోప్ లోడర్ వంటి అనేక టాయ్స్ ఉండటం పట్ల ఆయన నిర్వాహకులు కిరణ్ కుమార్‌ను అభినందించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, ఉనికిల శ్రీనివాస్, పాలపర్తి కృపానంద్, రేలంగి శ్రీను పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో గుడాల గోపీదే విజయం'

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో గుడాల గోపిదే విజయమని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. ఆయన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత టిడిపి హయాంలో నిమ్మల రూ.300 కోట్లతో అభివృద్ధి చేస్తే, వైసిపి హయాంలో రూ.2,400 కోట్లతో అభివృద్ధి, సంక్షేమానికి పనులు జరిగినట్లు చెప్పారు. వారం రోజుల్లోనే టిడ్కో గృహాల వద్ద వీధి దీపాలకు రూ 4.5 లక్షలు మంజూరు చేయించిన ఘనత గోపికి లేదని నిమ్మల చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. పాలకొల్లులో వైసిపి చేసిన ప్రతి పని తానే చేసినట్లు ఎంఎల్‌ఎ చెబుతున్నారన్నారు. దేశంలో కంప్యూటర్ తానే కనిపెట్టానని, కరోనా వ్యాక్సిన్ తానే కనిపెట్టానని చంద్రబాబు చెబుతూ అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు. గత నాలుగేళ్లుగా పాలకొల్లులో ఏ పని జరగలేదని, నిమ్మల మళ్లీ గెలిచినా ఉపయోగం లేదని ప్రజలు గ్రహించారని, అందుకే గోపి విజయం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో వైసిపి నేతలు రేలంగి శ్రీను, పెచ్చెట్టి కృష్ణాజి, పాలపర్తి కృపానంద్, కాపిశెట్టి శ్రీనివాస్, ఉనికిల శ్రీనివాస్, పిల్లా అప్పాజీ, తదితరులు పాల్గొన్నారు.


ఆలయ అధికారులు విరాళం అందిస్తున్న హేమ అచ్యుతాదేవి

మావుళ్లమ్మకు 8 గ్రాముల బంగారం విరాళం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో ఉన్న మావుళ్లమ్మకు భీమవరానికి చెందిన హేమ అచ్చుతాదేవి ఎనిమిది గ్రాముల బంగారం విరాళంగా ఆదివారం ఆలయ అధికారులకు అందించారు. వీరికి ఆలయ ముఖ్య అర్చకులు ప్రసాదాలు అందించారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

వైసిపి పట్టణ అధ్యక్షులు సత్తిబాబు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమని వైసిపి పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకొల్లు ఎంఎల్‌ఎ ఒకరిని హేళన చేసేముందు తమ నాయకుడు నారా లోకేష్ ప్రసంగంపై ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధమన్నారు. ఈ సమావేశంలో పాలకొల్లు పెదగోపురం ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, మండల కన్వీనర్ మైఖేల్ రాజు, కనకదుర్గ ఆలయ ఛైర్మన్ కావలి శ్రీనివాస్, వెంకటేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, మన్యం జగ్గమ్మ సత్రం ఛైర్మన్ నంబూరి పవన్‌నాయుడు, ఎఎంసి మాజీ ఛైర్మన్ సాల నరసయ్య, వైసిపి జిల్లా కార్యదర్శి కొండేటి రవి, జిల్లా ముస్లిం మహిళా ప్రెసిడెంట్ చాందే బిబి, జెసిఎస్ పోడూరు కన్వీనర్ బళ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

బొలిశెట్టితో జనసేన రాక్స్ ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

హైదరాబాద్ ఉద్యోగులు, ఉన్నత విద్యావంతులు జనసేన పార్టీకి అండగా నిలవడం పార్టీ తొలి విజయమని ఉభయ గోదావరి జిల్లాల పార్లమెంటరీ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన జనసేన రాక్స్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం తాడేపల్లిగూడెం జనసేన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన చేస్తుందన్నారు. రాక్స్ ప్రతినిధులు మాట్లాడుతూ జనసేన అధ్యక్షుని ఆశయాలు నచ్చి ఆయన చేసే సేవాకార్యక్రమాలలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో జనసేన రాక్స్ ఏర్పడిందన్నారు. 2024 ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో తాడేపల్లిగూడెం, కాకినాడ రూరల్, భీమిలి నియోజకవర్గాలను ఎంచుకొని అక్కడి అభ్యర్థులకు అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జి.శివ, విఎస్ఎన్.మూర్తి, వైవి.రాంబాబు, ఎ.సతీష్‌బాబు, జి.విశ్వనాథ్, పి.వెంకటేశ్వరరావు, పివి.సత్యనారాయణ, ఇ.బాబూరావు, సిహెచ్‌వి.రాము, జి.రామకృష్ణారావు, నానిబాబు, బి.ఈశ్వరరావు, రత్నకుమారి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండి

సచివాలయ ఉద్యోగితో అసభ్యంగా మాట్లాడిన వ్యక్తిపై ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కలిగొట్ల గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి సాలా రాఘవ ఉనుదుర్రు గ్రామానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఉనుదుర్రుకు చెందిన మహిళ గొల్ల పుష్పలత పాస్‌పోర్ట్ విచారణ నిమిత్తం ఆమె సోదరుడు శామ్యూల్‌కు ఫోన్ చేసి వివరాలు కోరగా శామ్యూల్ రాఘవతో అసభ్యంగా మాట్లాడుతూ బూతులు తిట్టాడని రాఘవ ఉండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - వీరవాసరం

కోడిపందేల స్థావరంపై వీరవాసరం పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కోడిపుంజులు, కోడి కత్తులు, నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మత్స్యపురిపాలెం పంచాయతీ పరిధిలోని కమతాలపల్లిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు వీరవాసరం ఎస్ఐ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులు, రూ.3,200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సృజనాత్మకతతో విద్యాబోధన

విద్యార్థుల అభ్యున్నతికి కృషి
ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి

ప్రజాశక్తి - కాళ్ల


బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి

మారుతున్న విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు వినూత్నంగా బోధన చేస్తూ వారిని తీర్చిదిద్దుతున్నారు. కొందరు ఉపాధ్యాయులు బోధనను కేవలం పాఠశాల గదులకే పరిమితం చేయకుండా... ఉపకరణాలు.. వివిధ రీతులను మేళవించి చేయడంతో భావి పౌరులకు మేలు జరుగుతుంది. సృష్టిలో పనికిరాని వస్తువులతో అందమైన ఆకృతుల్లో బోధనోపకరణాలను తక్కువ ఖర్చుతో తయారు చేసి పిల్లలకు సులువుగా పాఠాలు బోధించడానికి ఆయన నిరంతరం కృషి చేస్తుంటారు. ఆ ప్రయత్నంలో అందరి ప్రశంసలు పొందడమే కాదు. అవార్డులు కూడా అందుకుని ఉంటారు. బొబ్బిలి రాజమౌళి కోటేశ్వర స్వామి మాస్టారు 2002లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. భీమవరం మండలంలో వెంకటతిప్ప ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించి అక్కడ మూడేళ్లు పని చేశారు. ఆ తర్వాత భీమవరంలో ఎల్‌విఎన్ ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేశారు. ప్రస్తుతం సీసలి గ్రామంలోని స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు. ఉద్యోగంలో ప్రవేశించినప్పటి నుంచి టిఎల్ఎం తయారీలో మంచి ప్రతిభ కనపర్చి 2015లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు వివిధ సంస్థలు ఇచ్చిన అవార్డులను అందుకున్నారు. ఫౌండేషనల్ లీట్రసీ, నుమేరసీపై మూడురోజుల రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం గతే డాది సెప్టెంబర్ 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఎస్‌సిఇ ఆర్‌టి ఆధ్వర్యంలో ఎస్‌సిఇఆర్‌టి ప్రొఫెసర్లచే విజయవాడ అలంకార్ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొబ్బరిచిప్పలు, కార్డ్ బోర్డ్‌తో వీణను తయారుచేశారు. ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి, ఎస్‌సిఇఆర్‌టి హె చ్‌ఒడి అనూప్ కుమార్‌రాజ్‌పుట్‌లు స్వామి మాస్టర్‌ని అభినందించారు.

స్వామి మాస్టర్ తయారుచేసిన బోధనోపకరణాలు

దసరా సెలవులను ఉపయోగించుకుని చక్కని మోడల్స్, టిఎల్ఎం తయారు చేశారు. ఖాళీ అట్టపెట్టెలు, పాత వార్తాపత్రికలు, కార్డ్ బోర్డులను ఉపయోగించి పిల్లలకు ఉపయోగపడే లో కాస్ట్, నో కాస్ట్ టిఎల్ఎం తయారుచేశారు. సెలవులో కూడా పాఠశాలకు వెళ్లి నాడు-నేడు పనులను చేయిస్తూ, మరోపక్క తమ విద్యార్థులకు పాఠ్య బోధనలోఉపయోగపడే టిఎల్ఎం తయారుచేశారు. టిఎల్ఎం తయారీలో స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా అనేక కార్యక్రమాలలో పాల్గొనడంతో పాటు రాష్ట్ర స్థాయి టిఎల్ఎం మాడ్యూల్స్ రూపకల్పనలో ముఖ్య భూమిక పోషించారు. కార్డ్ బోర్డ్‌తో చేసిన కదిలే రథం. గడియారంలో టైం చెప్పడంతో పాటు ఈ సమయానికి ఏం చేయాలో పిల్లలకు చెప్పడానికి ఉపయోగపడుతుంది. ఖాళీ అట్టపెట్టె , కార్డ్ బోర్డ్‌తో తయారు చేసిన పల్లకి, కార్డ్ బోర్డ్, పాత పేపర్లతో కుతుబ్ మీనార్, కార్డ్‌బోర్డ్‌తో లైట్ హౌస్, శాటిలైట్ మోడల్‌లను స్వామి మాస్టర్ స్వయంగా తయారు చేశారు. విద్యాబోధనలో వీటిని తరచూ ఉపయోగిస్తూ విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పిస్తున్నారు.

కృషి అమోఘం

బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి 2023 రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎన్నిక కావడానికి ఆయన చేసిన కృషి అమోఘం. దాతల సహకారంతో తాను పనిచేసిన ప్రతి పాఠశాలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యాసామగ్రి అందించారు. నాడు-నేడులో నోడల్ టీచర్‌గా పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దించారు. దాతల సహకారంతో పాఠశాల గోడలపై చక్కని బొమ్మలు వేయించారు. పిల్లల్లో ఆశించిన సామర్థ్యాలను సాధించడానికి లో కాస్ట్, నో కాస్ట్ మెటీరియల్ తయారుచేశారు. క్రీడల్లో పిల్లలు చక్కని ప్రతిభ కనపరచేటట్లు, చేయడం, వారు మండల స్థాయి పోటీల్లో బహుమతులు పొందడం వీరి కృషికి తార్కాణం. పాఠశాల వార్షికోత్సవాలను నిర్వహించడం ద్వారా పిల్లల్లో దాగి ఉన్న కళలను వెలికి తీయడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించారు. దాతల సాయంతోనే కాకుండా తను వ్యక్తిగతంగా కూడా కంచాలు, దేశ నాయకుల చిత్రపటాలు, కుర్చీలు అందించారు. అంతేకాక జిల్లా, రాష్ట్ర స్థాయిలో రిసోర్స్‌పర్సన్‌గా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం, మాడ్యూల్స్ తయారీలో భాగస్వామిగా ఉండడం, ఇ కంటెంట్ తయారు చేయడం వంటి అంశాల్లో వీరు ప్రతిభ కనబరిచారు. ఈ నెల ఐదో తేదీన విశాఖపట్నంలోని ఎయు కాన్వొకేషన్ హాలులో నిర్వహించే గురుపూజోత్సవ అధికారిక కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అందించనున్నారు.

అవార్డు రావడం ఆనందంగా ఉంది
బొబ్బిలి రాజమౌళి కోటేశ్వర స్వామి, సీసలి స్పెషల్ ప్రాథమిక పాఠశాల

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం ఆనందంగా ఉంది. తాను నేర్పించిన ప్రతి పదం, దానికి సంబంధించిన చిత్రాలు, బొమ్మలను విద్యార్థులు ఎంతో చక్కగా గుర్తిస్తూ పాఠాలు నేర్చుకుంటున్నారు. ఆడియో, వీడియోల ద్వారా పాఠాలు త్వరితంగా అర్థమవుతాయి. టీవీ, వస్తువుల ద్వారా పాఠాలు బోధించే సమయంలో విద్యార్థులంతా ఆసక్తిగా వింటున్నారు. ఆట, పాటల ద్వారా విద్యాబోధన చేపడుతున్నాం.

వేలం పాట నుంచి చెరువులను మినహాయించాలి

రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు శ్రీనివాస్, సుబ్బారావు

ప్రజాశక్తి - వీరవాసరం

గ్రామాల్లో తమ వృత్తి నిర్వహణలో భాగంగా రజకులకు కేటాయించిన చెరువులకు ఆదాయం పేరుతో పంచాయితీలు నిర్వహించే వేలం పాటల నుంచి మినహాయింపు ఇవ్వాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు వద్దిపర్తి శ్రీనివాస్, యండమూరి సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పూర్వం నుంచి రజకులు గ్రామాల్లో తమ వృత్తిని నిర్వహించుకుంటూ జీవిస్తున్నారని పేర్కొన్నారు. రజక వృత్తిని సామాజిక సేవగా గుర్తించాలని కోరారు. అనాధిగా రజకులు వృత్తి కొనసాగించుకోవడంలో భాగంగా వారికి ప్రత్యేకంగా చెరువులను కేటాయించినట్లు తెలిపారు. తమకు కేటాయించిన చెరువుల్లో చేపలను రజకులు పట్టుకోవడం ద్వారా వచ్చే ఆదాయంతో తమ జీవణ ప్రమాణాలు పెంపొందించుకునే అవకాశం ఉండేదన్నారు. అటువంటిది జిఒల పేరుతో, జిల్లా అధికారులు ఆదేశాలంటూ తమకు కేటాయించిన చెరువులను వేలం పాటద్వారా ఇతరులు కట్టబెట్టడంతో చెరువుల స్వరూపం మార్చి వేస్తున్నారన్నారని తెలిపారు. దీంతో పాటదారులు చేపలకు మేత పేరుతో నానా వ్యర్థాలు చెరువులో పడేయడంతో అవి కాస్తా కలుషితంగా మారి అనారోగ్యాలకు కారణమవుతున్నాయన్నారు. ఇవే చెరువులను తమకు కేటాయిస్తే సహజ సిద్ధంగానే వాటిని సంరక్షించుకుంటామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో గ్రామ రాజకీయాలను రజకులకు అంటకట్టి వారికి కేటాయించిన చెరువులను వేలం పాట నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇటీవల మండలంలోని కొణితివాడ గ్రామంలో రజకుల చెరువును వేలం పాట నుంచి మినహాయించాలంటూ అక్కడ అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినట్లు తెలిపారు. ఇదేవిధంగా రాష్ట్రంలో ఉన్న అన్ని రజకుల చెరువులను వేలం పాట నుంచి మినహాయింపు ఇచ్చే అవకాశాన్ని ప్రభుత్వం ఆలోచించాలని కోరారు.

సర్పంచి సుబ్బారావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల


కందుల లక్ష్మికి నిర్మించిన ఇంటి వద్ద సర్పంచి సుబ్బారావు, ట్రస్టు సభ్యులు

దొడ్డనపూడిలో సర్పంచి కొల్లి సుబ్బారావు భాస్విని ట్రస్ట్ ద్వారా కందుల లక్ష్మి పేద కుటుంబానికి ఒక ఇల్లును నిర్మించి ఇవ్వడం అభినందనీయమని జుత్తిగ నాగరాజు అన్నారు. దొడ్డనపూడిలో కొల్లి సుబ్బారావు నిర్మించిన ఇల్లును జుత్తిగ నాగరాజు ఆదివారం ప్రారంభించారు. పేద కుటుంబానికి ఒక ఇల్లు నిర్మించడం సర్పంచి సేవ గుణానికి నిదర్శనం పలువురు వక్తలు అన్నారు. కందుల లక్ష్మి భర్త చనిపోవడంతో ఆమె తాటాకింట్లో నివాసం ఉంటుంది. ఆమె పరిస్థితిని గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు గమనించి సుమారు రూ.మూడు లక్షలతో ఇల్లు నిర్మించి ఇచ్చారు. ట్రస్టు ద్వారా పేద ప్రజలకు ప్రతినెలా ఆర్థిక సాయం చేయడంతో పాటు వృద్ధాప్య పింఛన్లు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డనపూడి సర్పంచి కొల్లి సుబ్బారావు, మాజీ ఎంపిపి ఆరేటి వెంకట రత్నప్రసాద్, ఎరుబండి రామాంజనేయులు, కాళ్ల సర్పంచి బందా విజయ పండు, ఎంపిటిసి సభ్యులు పన్నాసి సూర్యకుమారి, సత్యనారాయణ, మేక మహంకాళి, ఒగిరాల రాజేష్, ఇర్రింకి జగన్, ఆరేటి దిలీప్, నిమ్మకాయల సాయికుమార్, కొల్లిపరశురామయ్య, కొల్లి శ్రీనివాస్, ఎంపిటిసి మాజీ సభ్యులు కందులపాటి వీర రాఘవులు, మేక వీరస్వామి పాల్గొన్నారు.

కుమారుడు, బావమరుదుల దాడిలో వ్యక్తి మృతి?

నిందితులను అరెస్టు చేయాలని ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామం పెదపేటకు చెందిన నల్లి సత్యనారాయణ (50)పై అతని కుమారుడు గ్రామ వాలంటీర్ నల్లి కిరణ్, సత్యనారాయణ బావమరుదులు గ్రామ సచివాలయ కన్వీనర్ వడ్డీ రారాజు, రామకృష్ణ (యేసు) సామూహికంగా దాడి చేయడంతో అతను మృతి చెందాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లి సత్యనారాయణ తాగుడుకు బానిసై చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల రెండో తేదీ శనివారం రాత్రి చించినాడ సెంటర్‌లో రావి చెట్టు సమీపంలో మద్యం మత్తులో ఉన్న సత్యనారాయణపై అతని కుమారుడు, బావమరుదులు విచక్షణారహితంగా దాడి చేశారని, ఈ దాడిలో తలకు బలమైన గాయం కావడంతో స్పృహ తప్పి పడిపోయిన సత్యనారాయణను వారి సొంత ఆటోలో ఇంటికి తీసుకెళ్లారని, తెల్లారేసరికి సత్యనారాయణ మృతి చెందాడని గ్రామస్తులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న యలమంచిలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. దీనిపై యలమంచిలి ఎస్ఐ జెవిఎన్.ప్రసాద్‌ను వివరణ కోరగా విచారణ చేపట్టామని తెలిపారు.

నిందితులను అరెస్టు చేయాలి

అకారణంగా సత్యనారాయణపై దాడి చేసి అతని మృతికి కారణమైన నిందితులను అరెస్టు చేయాలని డివైఎఫ్ఐ, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మంత్రి కొట్టును కలిసిన నన్నయ క్యాంపస్ ప్రిన్సిపల్ అశోక్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


మంత్రి కొట్టుకు పుష్పగుచ్ఛ అందిస్తున్న అశోక్

ఆదికవి నన్నయ క్యాంపస్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ టి.అశోక్ ఆదివారం ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను మర్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా టి.అశోక్‌ను మంత్రి కొట్టు సత్యనారాయణ అభినందించి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విద్యా పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్య, పరిశోధన, క్యాంపస్ అభివృద్ధి ప్రమాణాలను మరింత పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు.

'టిడిపితోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ'


భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఆచంట

చంద్రబాబు నాయుడు రాజమండ్రిలో ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలో నిరుద్యోగులకు, మహిళలకు, రైతులకు పెద్దపీట వేస్తూ ఆరు కీలకమైన పథకాలను ప్రవేశపెట్టారని మాజీ మంత్రి పితాని తనయుడు పితాని వెంకట్ అన్నారు. మండలంలోని కందరవల్లి గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి, మహిళాశక్తి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని వెంకట్ ఇంటింటికి తిరిగి మినీ మేనిఫెస్టోలో పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపిపి సూర్యకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, భీమలాపురం సర్పంచి గుబ్బల మాధవరావు, నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసరావు, గొడవర్తి శ్రీరాములు, తమ్మినీడి ప్రసాద్, కేతా మురళి, బోడపాటి దుర్గాప్రసాద్, చిలుకూరి శ్రీనివాస్, ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పలుచోట్ల వర్షం.. రోడ్లు జలమయం

అధ్వాన రహదారుల్లో ప్రజలు, వాహదారుల అవస్థలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆదివారం తెల్లవారుజామున మండలంలో వర్షం కురిసింది. దీంతో పొలమూరు నుంచి నౌడూరు సెంటర్‌కు వెళ్లే ఆర్అండ్‌బి రహదారి అధ్వానంగా తయారైంది. గోతుల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఎక్కడ గొయ్యి ఉందో తెలియక ఇబ్బంది పడ్డారు. రాత్రి సమయాల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రహదారిపై వర్షపు నీరు నిలిచింది. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్ని రోజులుగా ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. ఆదివానం వర్షం కురవడంతో ప్రజలు సేదతీరారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు.


మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్‌లో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

'యువగళం పాదయాత్ర జయప్రదానికి పిలుపు'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో సోమవారం నారా లోకేష్ చేపట్టే యువగళం పాదయాత్రను, బహిరంగ సభను జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు యువగళం పాదయాత్ర రూట్ మ్యాప్ వివరించి మాట్లాడారు. యువగళం పాదయాత్రకు ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను పాలకపక్షం సహించలేక పోలీసుల సమక్షంలో దాడులకు పాల్పడుతుందన్నారు. టిడిపి భీమవరం మండల అధ్యక్షులు కవురు పృధ్విశంకర్ మాట్లాడుతూ భీమవరంలో జరిగే బహిరంగ సభలో పెద్ద ఎత్తున టిడిపి నేతలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు వేండ్ర శ్రీనివాసరావు, యిందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, గంటా త్రిమూర్తులు, గూడూరు సుబ్బారావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.